సాక్షి
సూర్యాపేట
శుక్రవారం ౹ 23 ౹ మే ౹ 2025



లింగ నిర్ధారణ పరీక్షల కలకలం
నకిరేకల్‌లో కొందరు గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. - 8లో



పెరుగుతున్న మూసీ నీటిమట్టం
మూసీకి 540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం 636.50 అడుగులకు చేరుకుంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34°/27°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : హైదరాబాద్ సీసీఎస్‌లో అడిషనల్ డీసీపీగా పని చేస్తున్న యు.రవీందర్ రెడ్డిని సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావును డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసింది.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సూర్యాపేట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రసన్నకుమార్ గురువారం రాత్రి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను బహూకరించారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు సహస్రకుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయా చార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

అర్హతలేని డాక్టర్లపై కేసు నమోదు చేయాలి

సూర్యాపేట అర్బన్: వచ్చీరాని వైద్యంతో ప్రాణాలు హరిస్తున్న అర్హత లేని డాక్టర్లపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యు) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది మారపాక వెంకన్న గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైద్యం అనేది భారత రాజ్యాంగం కల్పించిన ఒక ప్రాథమిక హక్కు అని, వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినప్పుడు చట్టం జోక్యం చేసుకోవాల్సిందే అని స్పష్టం చేశారు. విలువైన ప్రాణాలు అర్హత లేని డాక్టర్ల చేతిలో గాలిలో కలుస్తుంటే సంబంధిత శాఖ అధికారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● విశేషాలంకరణలో భక్తాంజనేయస్వామి



హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ భక్తాంజనేయ దేవాలయంలో తమలపాకులు, పూలతో విశేషాలంకరణలో స్వామివారు – తాళ్లగడ్డ

దారితప్పుతున్నారు!


❖ నెల రోజుల క్రితం చింతలపాలెం ఎస్‌ఐ అంతిరెడ్డి రేషన్ బియ్యం కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

❖ వారం రోజుల క్రితం సూర్యాపేటలో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడిని అరెస్ట్ చేయకుండా ఉండడానికి డీఎస్పీ పార్థసారథి, సీఐ వీరరాఘవులు రూ.16 లక్షలు డిమాండ్ చేసి అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడ్డారు.

❖ రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మిషన్‌భగీరథ కార్యాలయంలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఇస్లావత్ వినోద్ కాంట్రాక్టర్ నుంచి లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు ఉద్యోగుల అడ్డదారులు

- నెల రోజుల వ్యవధిలోనే ఏసీబీకి చిక్కిన నలుగురు అధికారులు
- మరో ఇద్దరు రెవెన్యూ అధికారులపై కేసు
- ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల అనుమతులకు వసూళ్లు!



కోదాడ: జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు కొందరు డబ్బు సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. వివిధ రకాల పనుల కోసం వచ్చే వారి నుంచి కొందరు, అక్రమార్కులకు కొమ్ము కాయడానికి మరి కొందరు దారితప్పి వసూళ్లకు పాల్పడుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే జిల్లాకు చెందిన నలుగురు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. నాలుగు నెలల క్రితం హుజూర్‌నగర్, మోతె తహసీల్దార్లు అక్రమాలకు పాల్పడడంతో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినా అధికారుల తీరులో మార్పు రావడంలేదు.

భూ వివాదాలను అనుకూలంగా మార్చుకొని..

జిల్లా వ్యాప్తంగా భూముల ధరలకు రెక్కలు రావడంతో వివాదాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. దీన్ని రెవెన్యూ అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకొని కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడేవారికి కొమ్ము కాస్తూ దానికి ప్రతిఫలంగా భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం కోదాడ తహసీల్దార్ ఒకరు ధరణి ఆపరేటర్‌తో కలిసి రైతునుంచి డబ్బులు డిమాండ్ చేశారు. దీన్ని సదరు రైతు రికార్డు చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ధరణి ఆపరేటర్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించి తహసీల్దార్‌ను బదిలీ చేశారు. ధరణి ఆపరేటర్ స్థానంలో వచ్చిన మరొకరు కూడా వసూళ్లకు పాల్పడడంతో అతడిని కూడా బదిలీ చేశారు. ఇలా ఒకరిపై చర్యలు తీసుకుంటున్నా ఆ తరువాత వచ్చిన వారు కూడా ఏమాత్రం భయం లేకుండా మళ్లీ అక్రమాలకు తెరతీస్తున్నారు.

❖ మూడునెలల క్రితం మోతె తహసీల్దార్‌గా పని చేసిన సంఘమిత్ర ఒకరి వద్ద రూ.6 లక్షలు లంచం తీసుకొని అక్రమంగా భూమి పట్టా చేయడంతో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

❖ హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పని చేసిన జయశ్రీ ప్రభుత్వ భూమిని తన బంధువుల పేరిట అక్రమంగా పట్టా చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెపై కేసు పెట్టి అరెస్ట్ చేసి నాలుగు నెలల క్రితం జైలుకు కూడా పంపారు.

అస్తవ్యస్తంగా వైద్య ఆరోగ్యశాఖ పనితీరు!

జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ పనితీరు అస్తవ్యస్తంగా తయారైందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. జిల్లా స్థాయి అధికారిపైనే ఆరోపణలు రావడం చర్చనీయాంశమైంది. ప్రైవేట్ వైద్యశాలలు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు అనుమతి ఇవ్వడానికి, రెన్యువల్ చేయడానికి కొందరిని నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణ లున్నాయి. అర్హత లేని వైద్యుల చేత నిర్వహిస్తున్న వైద్యశాలలపై ఆరోపణలు వచ్చిన సమయంలో మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ దానికి ప్రతిఫలంగా భారీ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం కోదాడకు చెందిన ఒక వైద్యుడు ఇతర దేశాలలో చదివి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ పాస్ కాలేదు. దీంతో అతను వెబ్‌సైట్ నుంచి తన పేరును పోలిన మరో వైద్యుడి సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకొని దానినే తన డిగ్రీగా చూపాడు. ఇలా మూడు సంవత్సరాలు కోదాడలో వైద్యసేవలందించాడు. ఇతనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఇక్కడ ఇరుశాఖల అధికారులు సదరు నకిలీ వైద్యుడినుంచి డబ్బులు దండుకున్నారనే ఆరోపణలున్నాయి.

25వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈనెల 25 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, మండల అభివృద్ధి అధికారులతో రాజీవ్ యువ వికాస పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటగిరీలవారీగా రిజర్వేషన్ నిష్పత్తిని అనుసరించి మండల స్థాయి కమిటీలతో ఎంపిక పూర్తి చేసి జిల్లా స్థాయికి లబ్ధిదారుల జాబితాను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎల్డీఎం బాపూజీ, డిప్యూటీ సీఈఓ శిరీష, మెప్మా పీడీ రేణుక, మత్స్యశాఖ అధికారి నాగయ్య, డిడబ్ల్యూఓ నరసింహారావు, డీటీడీఓ శంకర్, మైనార్టీ అధికారి జగదీష్ రెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి, సర్వే అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఐ ఆదిత్య, ఆడిట్ అధికారి శ్యామ్ సుందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలు సాధించాలి

బ్యాంకర్లు వారికి ఇచ్చిన లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 4వ త్రైమాసికంలో సాధించిన లక్ష్యాలను ఎల్‌డీఎం బాపూజీ వివరించారు. వ్యవసాయ రుణాల్లో గడిచిన 2024–25 సంవత్సరంలో రూ.2242.48 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే రూ.4305.51 కోట్లు లక్ష్యం పూర్తి చేసి 146.32 శాతం వృద్ధి సాధించామన్నారు. అనంతరం 2025–26 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం గోమతి, నాబార్డ్ డీడీఎం రవీంద్ర నాయక్, ఎస్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్, అన్నిబ్యాంకుల అధికారులు, జిల్లా అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

2,89,063 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు 2,89,063 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మరో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉందని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాంబాబు, సివిల్ సప్లయ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి



దళిత వైతాళికుడు ఎం.వి.భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ నరసింహ, అధికారులు

జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు పోస్టింగ్

భానుపురి (సూర్యాపేట) : ఇటీవల వివిధ జిల్లాల నుంచి సూర్యాపేట జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు పోస్టింగులు ఇవ్వడంతో పాటు అక్కడ పనిచేస్తున్న తహసీల్దార్లకు ఇతర మండలాలకు బదిలీ చేశారు. ఈమేరకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ జిల్లా నుంచి వచ్చిన తిరుపతి ప్రకాష్ ను చివ్వెంల తహసీల్దార్‌గా నియమించి అక్కడ పనిచేస్తున్న కృష్ణయ్యను సూర్యాపేటకు బదిలీ చేశారు. జనగామ జిల్లా నుంచి కేటాయించిన వెంకన్నకు మోతె తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చి అక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్‌ను రిలీవ్ చేశారు. నాగర్ కర్నూల్ నుంచి బదిలీపై వచ్చిన చంద్రశేఖర్ ను కోదాడ ఆర్డీఓ కార్యాలయానికి కేటాయించగా అక్కడ పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిని మునగాల తహసీల్దార్ గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక నల్లగొండ జిల్లా నుంచి వచ్చిన సంతోష్ ను మద్దిరాల తహసీల్దార్ నియమించగా అక్కడ పనిచేస్తున్న అమీన్ సింగ్ ను జాజిరెడ్డిగూడెం తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధుల్లో ఉన్న రాజేందర్ రెడ్డిని ఖాళీగా ఉన్న మేళ్లచెరువు తహసీల్దార్‌గా పోసింగ్ ఇచ్చారు.

తొలిరోజు 2,819మంది హాజరు

● ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



ప్రతిభ జూనియర్ కళాశాల సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేటటౌన్ : ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,819 మంది హాజరయ్యారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించారు. మొత్తం 2,312 మంది విద్యార్థులకు 198 మంది గైర్హాజరు కాగా 2,114 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించారు. మొత్తం 765 మంది విద్యార్థులకు 60 మంది గైర్హాజరు కాగా 705 మంది హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ భానునాయక్ తెలిపారు.

అదనపు కలెక్టర్ తనిఖీ

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు.

పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

అర్వపల్లి: గ్రామ పంచాయతీ రికార్డులను కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి కోరారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వననర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నల్లా కనెక్షన్‌లను పరిశీలించాలని కోరారు. గ్రామ పంచాయతీ రికార్డులు వంద శాతం అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.గోపి, పంచాయతీ కార్యదర్శి గజవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సఫాయిమిత్ర సురక్ష' మరింత పటిష్టం

- మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై కేంద్రం ప్రత్యేక దృష్టి
- విధిగా వైద్య శిబిరాల నిర్వహణకు ఆదేశం
- ఆరోగ్య పరిరక్షణ కిట్లు పంపిణీ చేయాలని సూచన



సూర్యాపేట అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యపరిరక్షణపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. కార్మికుల ఆరోగ్యం బాగుంటేనే పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడటానికి వీలుంటుందని భావిస్తోంది. విధి నిర్వహణలో భాగంగా అనేకమంది పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సఫాయి సురక్షను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా విధిగా వైద్యశిబిరాల నిర్వహణతోపాటు ఆరోగ్య పరిరక్షణ కిట్లు అందజేయాలని సూచించింది.

మున్సిపాలిటీ	పారిశుద్ధ్యకార్మికులు
సూర్యాపేట	303
కోదాడ	176
తిరుమలగిరి	63
హుజూర్‌నగర్	42
నేరేడుచర్ల	28

కార్మికులకు ప్రయోజనం కలిగేలా..

సూర్యాపేట జిల్లాలో మొత్తం ఐదు మున్సిపాలిటీలు సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల ఉన్నాయి. వీటిలో 549 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరు నిత్యం రోడ్లు ఊడ్చడం, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, చెత్త కుప్పలు ఎత్తడం లాంటి పనులు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించారు. పీఎఫ్, ఈఎస్ ఐ సక్రమంగా వర్తింపజేసేలా శ్రద్ధ చూపాలని నిర్ణయించారు. వీరి కోసం గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఆరోగ్య సంరక్షణ లాంటి సదుపాయాలు అందేలా చూడాలనుకున్నా ఎక్కడా అమలు కాలేదు. ఆ సౌకర్యాలను అందించేలా చూడాలని మరొకసారి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించింది. తీవ్ర అనారోగ్యం ఉంటే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించి వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యపరమైన జాగ్రత్తలపై అవగాహన

పారిశుద్ధ్య కార్మికులకు వేసవిలో వచ్చే ఎండలతో వానాకాలంలో వచ్చే వర్షంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆరోగ్య రక్షణ కిట్లు ఇవ్వనున్నారు. చేతికి గ్లౌజులు, కాళ్లకు పొడవాటి బూట్లు, తల రక్షణకు హెల్మెట్ పంపిణీ చేయనున్నారు. అంటువ్యాధులను అరికట్టడానికి తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో..

స్థానిక వైద్యశాఖ.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో శిబిరాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. సాధారణ వైద్యం అందించే వీలుంటే ఇక్కడే చికిత్స చేయనున్నారు. వ్యాధి పరిమాణం ఎక్కువైతే రాష్ట్ర రాజధానికి తరలించనున్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నాం



పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలకు ఒకసారి స్థానిక వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. గత సంవత్సరం డిసెంబర్‌లో పరీక్షలు చేయించాం. జూన్ రెండో వారంలో మళ్లీ చేయిస్తాం. సఫాయిమిత్ర సురక్ష అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నాం.

– మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

వైద్యం మాఫియాపై నేడు చర్చా వేదిక

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైద్యం మాఫియా ఆగడాలు, అధికారుల అలసత్వం నేపథ్యంలో జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా 'సూర్యాపేట వైద్య రంగానికి ఏం రోగం వచ్చింది' అనే పేరుతో చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



సువర్ణ పుష్పార్చన మూర్తులకు హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూలను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శనహోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి,అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన నారసింహ హోమం , బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన తదితర పూజలు చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కట్టంగూర్ : ఇంట్లో దండెంపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన కట్ట శంకర్, లక్ష్మి(35)దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం ఉదయం శంకర్ పని నిమిత్తం పిట్టంపల్లి గ్రామానికి వెళ్లాడు. ఇంటి దగ్గరే ఉన్న లక్ష్మి దుస్తులు ఉతికి వాటిని ఇంటి ఆవరణలో జే వైరుతో ఏర్పాటు చేసుకున్న దండెంపై ఆరేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. ఇది గమనించిన లక్ష్మి కుమార్తె అఖిల కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి లక్ష్మిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంట్లోకి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైరు కట్టిన పైపుకే దండెం తీగ కట్టడంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ ప్రసారం జరిగి ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కట్టంగూర్ ఎస్ఐ ఎం. రవీందర్ తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు


చండూరు: అతివేగంగా వచ్చిన కారు సూచిక రాయిని ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చండూరు మండలం దోనిపాముల గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం ఖమ్మగూడెం గ్రామానికి చెందిన మార్నేని అజయ్, మార్నేని కారుణ్య, కోయ అభినయ్ గురువారం కారులో సూర్యాపేటలో ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి ఖమ్మగూడెం వెళ్తున్నారు. మార్గమధ్యలో చండూరు మండలం దోనిపాముల గ్రామ శివారులోకి రాగానే అతివేగంతో ఉన్న కారును అదుపుచేయలేక సూచిక రాయిని గుద్దడంతో రోడ్డు పక్కనే కారు బోల్తా పడింది. కారులో ఉన్న ఒకరి కాలుకు గాయం కాగా.. మిగతా ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో నల్లగొండకు తరలించారు.

ఆటోను ఢీకొని..

భువనగిరి: ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్‌కు చెందిన చిన్నపాక హర్షవర్ధన్ తన కజిన్ సోదరుడైన అక్షిత్‌తో కలిసి బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో భువనగిరి మండలం అనంతారం గ్రామ పరిధిలోని ఫ్లైఓవర్‌పై అప్పటికే మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అక్షిత్‌కు గాయాలయ్యాయి. హర్షవర్ధన్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షల కలకలం

- నకిరేకల్‌లో నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్
- సూర్యాపేట జిల్లాకు చెందిన మహిళ మృతితో వెలుగుచూసిన దందా



నకిరేకల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిసినా కూడా కొందరు డబ్బులకు కక్కుర్తి పడి గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా నకిరేకల్ పట్టణంలో తాజాగా వెలుగులోకి వచ్చింది. నకిరేకల్‌లోని ఓ స్కానింగ్ సెంటర్‌లో ఇటీవల లింగ నిర్ధారణ పరీక్ష చేయించుకున్న మహిళ ఆ తర్వాత సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకుని తీవ్ర రక్తస్రావంతో మృతిచెందింది. ఈ బాగోతం బయటపడడంతో సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు తన ఇంటికి తాళం వేసి పరార్ కావడం నకిరేకల్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సూర్యాపేట జిల్లా మోతె గ్రామానికి చెందిన అనూష నకిరేకల్‌లోని ఓ స్కానింగ్ సెంటర్ లింగ నిర్ధారణ పరీక్ష చేయించుకుంది. తనకు అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడోసారి కూడా స్కానింగ్‌లో ఆడశిశువు అనే తెలియడంతో మూడు రోజుల క్రితం సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె మృతిచెందింది. ఈ విషయం బయటకు పొక్కడంతో అనూష భర్త నగేష్.. తన భార్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అబార్షన్ చేసిన ఆస్పత్రిపై పోలీసులు కేసు నమోదు చేసి సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు గురువారం నకిరేకల్ సీఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి నకిరేకల్‌లోని సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడి ఇంటికి వెళ్లగా.. అప్పటికే అతడు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. అతడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

చాలాకాలంగా కొనసాగుతున్న దందా..

నకిరేకల్‌లో స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తి గతంలో తన భార్యతో కలిసి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో సదరు వ్యక్తి భార్య లింగ నిర్ధారణ పరీక్షలపై మంచి అవగాహన పెంచుకుంది. స్కానింగ్ సమాచారం గర్భిణులకు తెలిపి వారి నుంచి సొమ్ము తీసుకుంది. ఈ విషయం తెలిసిన ఆ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ వారిద్దరిని బయటకు పంపించారు. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదై కాగా.. సదరు వ్యక్తి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. జైలు నుంచి వచ్చాక తన ఇంట్లోనే స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం. వీరికి దాదాపు 5 నుంచి 8 మంది ఏజెంట్లు ఉన్నట్లు తెలిసింది. నెలకు 15 నుంచి 20 రోజుల పాటు గుట్టుచప్పుడు కాకుండా స్కానింగ్ చేస్తున్నారు. ప్రతిరోజు 10 నుంచి 15 మంది వరకు గర్భిణులకు పరీక్షలు చేసి ఒక్కొక్కరి నుంచి తమ ఏజెంట్ల ద్వారా రూ.35 వేలకు బేరం కుదుర్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. తన భార్యతో స్కానింగ్ చేయించి అదే రూమ్‌లో దేవుళ్ల ఫొటోలు చూపించి కోడ్ రూపంలో గర్భవతి వెంట వచ్చిన బంధువులకు తెలియజేస్తారు.

నేను హెల్మెట్ ధరించి ఉంటే మీతో ఉండేవాన్ని..

చిట్యాల: హెల్మెట్ ధరించకపోవటంతో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. అతడి దశదినకర్మ రోజున కుటుంబ సభ్యులు రూపొందించిన పోస్టర్ పలువురిని కంటతడి పెట్టిస్తోంది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన అంతటి అజయ్‌కుమార్‌గౌడ్(26) ఓ ఫార్మసీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 18న అజయ్‌కుమార్‌గౌడ్ బైక్‌పై వలిగొండలో వివాహానికి హాజరై రాత్రి సమయంలో తిరుగు పయనమయ్యాడు. వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామ పరిధిలోకి రాగానే అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి కాల్వలో పడిపోవటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం నిర్వహించిన అజయ్‌కుమార్‌గౌడ్ దశదినకర్మ కార్యక్రమంలో.. 'నేను హెల్మెట్ ధరించి ఉంటే ఈ రోజు మీ అందరితో కలిసి ఉండేవాడిని.. బైక్ నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి' అంటూ అజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడినట్లుగా కుటుంబ సభ్యులు గ్రామంలోని రెండు చోట్లు పోస్టర్లు ఏర్పాటు చేశారు.



అంతటి అజయ్‌కుమార్ మాట్లాడినట్లుగా రూపొందిన పోస్టర్

స్వర్ణగిరీశుడికి సహస్ర దీపాలంకరణ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి గురువారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సుదర్శన నరసింహ హవనం, తిరుప్పావడ సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మందికి అన్నదానం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

ఆలేరు: ఎటువంటి పనిచేయకుండా ఇంట్లోనే ఉంటున్న యువకుడు మద్యానికి బానిసై మానసికంగా తీవ్ర నిరాశకు గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరు పట్టణంలో గురువారం జరిగింది. ఆలేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణానికి చెందిన ఎండీ యూసుఫ్(17) కొంతకాలం చికెన్ షాపులో పనిచేసి మానేశాడు. తల్లి, ఇతర కుటుంబ సభ్యులు ఏదైనా పని చేసుకోవాలని యూసుఫ్‌కు సూచించారు. ఈ క్రమంలో ఖాళీగా ఇంట్లోనే ఉండటంతో మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా తీవ్ర నిరాశకు గురైన యూసుఫ్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తల్లితో పాటు ఇతర కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి కాసేపు ప్రేమగా మాట్లాడాడు. అతడి మాటలు తేడాగా అనిపించడంతో కొద్దిసేపటి తర్వాత తల్లి తిరిగి యూసుఫ్‌కు ఫోన్ చేయగా ఎత్తలేదు. అనంతరం తన ఇంటి సమీపంలోని బీరప్ప గుడి వద్ద పందిరి కర్రకు తాడుతో ఉరేసుకుని యూసుఫ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తల్లి బయటకు వచ్చి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆత్మకూరు (ఎస్): వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపర్చారు. వివరాలు.. ఆత్మకూరు (ఎస్) మండలం ఏపూరి గ్రామానికి చెందిన రావుల నరేష్ ప్రేయసికి అదే గ్రామానికి చెందిన కారింగుల లింగయ్య లేనిపోని మాటలు చెప్పడంతో ఆమె నరేష్ దూరం పెడుతూ వచ్చింది. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ తన చావుకు కారింగుల లింగయ్యే కారణమని సెల్ఫీ వీడియో తీసి గత నెల 27న మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలంలో పురుగుల మందు తాగాడు. అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అదే నెల 28వ తేదీన మృతి చెందాడు. ఈ ఘటనపై సిరోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఈ నెల 14న కేసును ఆత్మకూరు(ఎస్) పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ దర్యాప్తు చేసి నరేష్ ఆత్మహత్యకు కారణమైన కారింగుల లింగయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. సీఐకి ఆత్మకూర్ ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ సహకరించారు.

మిర్యాలగూడలో చిరు వ్యాపారుల రాస్తారోకో

- తోపుడు బండ్లు తొలగించడంతో కోదాడ–జడ్చర్ల హైవేపై ఆందోళన


కోదాడ–జడ్చర్ల హైవేపై పండ్లు పోసి రాస్తారోకో చేస్తున్న చిరు వ్యాపారులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో తోపుడు బండ్లను తొలగించడంతో తమకు న్యాయం చేయాలంటూ గురువారం చిరు వ్యాపారుల జడ్చర్ల–కోదాడ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. పండ్లను హైవేపై పోసి సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వాహనాలను మళ్లించారు. చిరు వ్యాపారులు మాత్రం ఎమ్మెల్యే, కమిషనర్ రావాలంటూ నినాదాలు చేశారు. మిర్యాలగూడ వన్ టౌన్, టూ టౌన్, రూరల్ సీఐలు మోతీరాం, జె. సోమనర్సయ్య, పీఎస్‌డీ ప్రసాద్, ఎస్ఐలు రాంబాబు, సైదిరెడ్డి, మల్లికంటి లక్ష్మయ్య, ఏఎస్ఐ చంద్రయ్య బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న వారికి నచ్చజెప్పినా రాస్తారోకో విరమించలేదు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు మాట్లాడుతూ.. తాము చాలా ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, రోడ్డు పక్కన పెట్టుకున్న తోపుడు బండ్లను తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు ఆందోళనను విరమించేదిలేదన్నారు. కనీసం ఫుట్‌పాత్ పైన అయినా బండ్లు ఏర్పాటు చేసుకుంటామన్నారు. మాజీ కౌన్సిలర్లు జావీద్, ఆలగడప గిరిధర్, జానీ వచ్చి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకుందామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


వెంకట్‌రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. నార్కట్‌పల్లి మండలం చౌటబావి గ్రామానికి చెందిన ఏనాల వెంకట్‌రెడ్డి(36) చిట్యాలలో క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతడు గోపలాయపల్లి వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలో పురుగుల మందు తాగి తన తమ్ముడికి ఫోన్ చేశాడు. తన పిల్లలను మంచిగా చూసుకో అని చెప్పి.. గోపలాయపల్లి గుట్టపై తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానంటూ తమ్ముడికి చెప్పాడు. వెంటనే వెంకట్‌రెడ్డి సోదరుడు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మూసీ వాగులో మునిగి యువకుడు మృతి

కేతేపల్లి: కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ శివారులో మూసీ వాగులో మునిగి యువకుడు మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం కౌలూరు గ్రామానికి చెందిన గాలంకి నీరజ్(21) తన కజిన్ సోదరుడు వెంకటరవీందరరావుతో కలిసి గురువారం బైక్‌పై శాలిగౌరారంలోని తమ బంధువుల ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామ శివారులో మూసీ వాగుపై గల పాత బ్రిడ్జి వద్ద స్నానం చేసేందుకు ఇద్దరు కలిసి వాగులోకి దిగారు. నీరజ్‌కు ఈత రాకపోవడంతో ప్రమాదశవాత్తు వాగులోని నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున ఉన్న సోదరుడు వెంకటరవీందరరావు అతడిని కాపాడే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నీరజ్ మృతదేహాన్ని వాగులోని నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

క్షేత్రపాలకుడికి సహస్రనామార్చన

యాదగిరిగుట్ట : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పాతగుట్టలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి అభిషేకం, లక్ష తమలపాకులచే (నాగవల్లీ) సహస్ర నామార్చన చేశారు. ఆయా పూజల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష తమలపాకులతో అలంకృతుడైన శ్రీఆంజనేయస్వామి

ఇంగ్లిష్ సబ్జెక్ట్ క్రెడిట్స్ తగ్గింపు సరికాదు


ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇంగ్లిష్ అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు కేటాయించిన 20 క్రెడిట్స్‌ను 12కు తగ్గించాలనే ప్రతిపాదన సరికాదని, ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి విరమించుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంజీయూ ఇంగ్లిష్ విభాగం అధిపతి అరుణప్రియ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంగ్లిష్ అధ్యాపకులతో అత్యవసర సమావేశం నిర్వహించి, ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని చేసిన తీర్మానాన్ని ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్, డీన్ కె. అంజిరెడ్డికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రెడిట్స్ తగ్గించే నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఇంగ్లిష్ భాష ప్రాధాన్యతను గుర్తించి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటే, రాష్ట్రంలో మాత్రం ఇంగ్లిష్ భాషకు ప్రాధాన్యత తగ్గించేలా ఉన్నత విద్యామండలి ఏకపక్ష నిర్ణయాలు సరికాదన్నారు. ఒకవైపు రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తూ డిగ్రీ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను నేర్పిస్తామంటూ, మరోపక్క ఇంగ్లిష్‌కు ప్రాధాన్యత తగ్గించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ఇంగ్లిష్ అధ్యాపకులు ఈ. రాంరెడ్డి, చైతన్య, సుధ, చిలుముల సుధాకర్, హరికృష్ణ, వెంకట్, ప్రభాకర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న మూసీ ప్రాజెక్టు నీటి మట్టం

- 636.50 అడుగులకు చేరిన నీరు


నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 636.50 అడుగులకు చేరుకుంది. హైదరాబాద్‌తో పాటు మూసీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు మూసీలోకి గురువారం 540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు కాగా గురువారం సాంత్రానికి 636.50 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 622 అడుగుల కనిష్ఠ స్థాయికి పడిపోగా, గత 50 రోజుల్లో దాదాపు 15 అడుగుల మేర నీరు ప్రాజెక్టులోకి చేరింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వేసవి కాలంలోనే ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో సాంకేతిక సమస్యలు


ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోవడంతో క్యూలో వేచి ఉన్న రోగులు

- పనిచేయని కంప్యూటర్లు
- ఓపీ రిజిస్ట్రేషన్ వద్ద రోగుల ఇబ్బందులు

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలకు వైద్య కోసం వచ్చిన రోగులు గురువారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓపీ రిజిస్ట్రేషన్ విభాగంలోని కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పేషెంట్లు గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. దీంతో ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేచి ఉండక తప్పలేదు, స్థానికులు క్యూలైన్‌లో నిలిబడలేక తిరిగి వెళ్లిపోయారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొని రోగులకు సకాలంలో ఓపీ రిజిస్ట్రేషన్ జరిగేలా ఎయిమ్స్ అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చిరొట్ట.. పైరుకు బలం

గుర్రంపోడు: వచ్చే వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగను పొలాల్లో సాగు చేసుకుని భూమిలో కర్బన సేంద్రియం పెంచుకోవాలని గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సూచిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువుల వలన కలిగే ప్రయోజనాలు ఆయన మాటల్లోనే..


పండ్ల తోటల్లో సాగుచేస్తున్న పచ్చిరొట్ట

పచ్చిరొట్ట సాగుకు ఇదే అనువైన సమయం

సాధారణంగా వానాకాలం తొలకరి వర్షాలకు పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకుని పూత దశలో కలియదున్నడం వల్ల సేంద్రియ ఎరువులా పనిచేసి ప్రధాన పంటకు బలానిస్తుంది. భూమిలో సేంద్రియ కర్బనం తక్కువగా ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో మూడు శాతం పైగా సేంద్రియ కర్బనం ఉండగా, మన దేశంలో ఒక్క శాతానికి మించి ఉండటం లేదు.

పండ్ల తోటల్లో ..

పండ్ల తోటల్లో జనుము పంట సాగు చేసుకోవడం ఎంతో లాభదాయకంగా ఉంటుంది. పండ్ల మొక్కలు కాపునకు వచ్చేంత వరకు అంతరంగా జనుము సాగు చేసి పూత వచ్చే సమయంలో కలియదున్నాలి. ఎకరాకు 15 కిలోల జనుము విత్తనాలు సరిపోతాయి. పండ్ల తోటలు ఏపుగా ఎదగడానికి పచ్చిరొట్ట ఎరువు ఎంతగానో దోహదపడుతుంది. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి పండ్ల మొక్కలు తెగుళ్ల బారిన పడకుండా ఉంటాయి. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల జరిగే నష్టాన్ని పచ్చిరొట్ట ఎరువు ద్వారా తక్కువ ఖర్చుతో భర్తీ చేయవచ్చు. పండ్ల తోటల్లో జనుము సాగు వల్ల కలుపు మొక్కల సమస్య ఉండదు. పచ్చిరొట్టను పండ్ల తోటల పాదుల్లో వేసి మట్టితో కప్పి వేయాలి. పచ్చిరొట్ట ఎరువుగానే కాకుండా పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుంది.

ఏదో ఒక రకంగా భూమిలో సేంద్రియ కర్బనం పెంచేందుకు పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకోవాలి. మే రెండో పక్షం నుంచి నుంచి జులై రెండో పక్షం వరకు రైతులు ఏ పంటలు వేయరు కాబట్టి ఇటువంటి సమయంలో పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి పంటలు సాగు చేసుకుంటే ఎకరాకు పది టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఈ పంటలు పూత దశలో నేలలో కలియదున్నడం ద్వారా ఎకరాకు 25 నుంచి 35 కిలోల నత్రజని, ఐదు కిలోల పొటాష్ లభ్యమవుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు జనుము, జీలుగ సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తుంది. జీలుగ విత్తనాలను వ్యవసాయశాఖ రాయితీపై 30 కిలోల బస్తా రూ.2137కు, జనుము 40 కేజీల బస్తా రూ.2510కు పంపిణీ చేస్తోంది.

మాగాణుల్లో..

మాగాణి భూములు జీలుగ సాగు చేసుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుంది. దుక్కిని బాగా దున్నుకుని ఎకరాకు 20 కిలోల జీలుగ విత్తనాలు వేసుకోవాలి. పూత దశలో కలియదన్నడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. వరి నాటు వేసే నాటికి జీలుగ కలియదున్నడం వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. 45 రోజులు మించకుండా జీలుగను నీళ్ల పెట్టి కలియదున్నాలి.